శుక్రవారం 21, జూన్ 2024


ఈ-పేపర్ తెలుగు డైలీ

# ఇయ్యాల్టి NEWS

Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/

## ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ఊరట.. ఎట్టకేలకు బెయిల్ మంజూరు చేసిన కోర్టు




ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, జూన్ 20: మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు గురువారం ఊరట లభించింది. లక్ష రూపాయల పూచీకత్తుతో ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. బెయిల్‌ను వ్యతిరేకించేందుకు ఈడీ 48 గంటల సమయం కోరింది. శుక్రవారం డ్యూటీ జడ్జి ముందు ఈ వాదనలు చేసుకోవచ్చని కోర్టు తెలిపింది. రూ.లక్ష బాండ్‌పై కేజ్రీవాల్ నేడు శుక్రవారం తీహార్ జైలు నుంచి బయటకు రావచ్చని రూస్ అవెన్యూ కోర్టు వెల్లడించింది. కాగా.. సీఎం అరవింద్ కేజ్రీవాల్ రూ.100 కోట్లు డిమాండ్ చేసినట్లుగా ఆధారాలు ఉన్నాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కోర్టుకు తెలిపింది. అరెస్టుకు ముందే ఆధారాలు సేకరించినట్లుగా పేర్కొంది. కేజ్రీవాల్ పీఎంఎల్‌ఏ కింద దాఖలు చేసిన ఛార్జిషీట్లలో ఆయన పేరు లేదని కేజ్రీవాల్ తరపు న్యాయవాది విక్రమ్ చౌదరి వాదించారు.





నితిన్ గడ్కరీతో కిషన్ రెడ్డి సమావేశం.. ప్రాజెక్టుల అభివృద్ధిపై చర్చ 2లో



16 సీట్లతో టీడీపీ సాధించింది - కేటీఆర్ కీలక వ్యాఖ్యలు 2లో



మోదీ మానసికంగా కృంగిపోయాడు: రాహుల్ గాంధీ 3లో



పుతిన్‌కు అరుదైన శునకాలను గిఫ్ట్ ఇచ్చిన కిమ్ 3లో

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ ఆకర్ష్

## ఎటూ తేల్చుకోలేక అయోమయంలో ఎమ్మెల్యేలు



ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 20: భారత రాష్ట్ర సమితిలో అంతర్గతంగా అలజడి రేగుతోంది. పలువురు పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారన్న ప్రచారం జరుగుతూండటమే దీనికి కారణం. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక సీట్లలో డిపాజిట్లు కూడా కోల్పోవడంతో చాలా మంది నేతలు రాజకీయ భవిష్యత్ పై ఆందోళన చెందుతున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ నుంచి వారిపై ఒత్తిడి వస్తోంది. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ప్రయోగించిన ఆకర్ష్ తరహాలోనే ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఆకర్ష్ అస్త్రం ప్రయోగిస్తున్నారు. ఇప్పటికే ముగ్గురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరారు. ఓ బీఆర్ఎస్ ఎమ్మెల్యే చనిపోవడంతో వచ్చిన ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు.

**కాంగ్రెస్‌తో పలువురు ఎమ్మెల్యేల చర్చలు ?**

ప్రస్తుతం 35 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో ఉన్నారు. వీరిలో కనీసం ఇరవై మందిని పార్టీలో చేర్చుకోవాలని కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. నిజానికి పార్టీ ఫిరాయింపులపై పార్లమెంట్ ఎన్నికల కంటే ముందు నుంచే ఊహాగానాలు వస్తున్నాయి. కొంత మంది ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డితో సమావేశం అయ్యారు. వారంతా కాంగ్రెస్ చేరికలను ఖండించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే చేరిపోవడానికి రెడీ అయినా చివరి క్షణంలో ఆగిపోయారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను బట్టి నిర్ణయం తీసుకోవాలనుకున్నారు. ఇప్పుడు వారందరితో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం మరోసారి చర్చించి చేరికలకు రంగం సిద్ధం చేసుకున్నట్లుగా చెబుతున్నారు.

**పిలిచి మాట్లాడుతున్న కేసీఆర్**

ఎవరెవరు కాంగ్రెస్‌లో చేరుతారో స్పష్టత రావడంతో.. బీఆర్ఎస్ హైకమాండ్ వారిని బుజ్జగించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. కొద్ది రోజుల కిందట నలుగురు ఎమ్మెల్యేలను కేసీఆర్ ఫామ్ హౌస్‌కు పిలిపించుకుని మాట్లాడారు. వారితో దిగిన ఫోటోను విడుదల చేశారు. వారు పార్టీ మారుతారని తెలియడంతోనే పిలిచి మాట్లాడారని అంటున్నారు. అలాగే గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి కూడా పార్టీ మారబోతున్నారని అంటున్నారు.

**కేసీఆర్‌కు ప్రతిపక్ష నేత హోదా లేకుండా చేసేందుకే .. ?**

అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరవ్వాలని అనుకుంటున్నారు. అంతకు ముందే ఆయనకు ప్రతిపక్ష నేత హోదా పోయేలా చేయాలని కాంగ్రెస్ వ్యూహాత్మకంగా ప్రయత్నిస్తోందని చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీనే కాదు.. బీజేపీ కూడా ఎమ్మెల్యేలను ఆకర్షించే ప్రయత్నంలో ఉందని చెబుతున్నారు. ప్రధాన ప్రతిపక్షంగా తామే వ్యవహరించాలని బీజేపీ అనుకుంటోంది. రాష్ట్రంలో రాజకీయ భవిష్యత్ బీజేపీకే ఉంటుందన్న ఉద్దేశంతో కొంత మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బీజేపీ వైపే చూస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాలతో తమ పార్టీ నేతల్ని ఆపడం.. బీఆర్ఎస్ అగ్రనాయకత్వానికి తలకు మించిన భారం అవుతోంది.



అంబర్ పేట మున్సిపల్ మైదానంలో విద్యార్థులతో కలసి యోగా చేస్తోన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం: ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 20: ప్రతి ఒక్కరూ యోగా చేయడం అలవాటుగా చేసుకోవాలని యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. యోగాతో మానవ శరీరానికి ఎంతో మేలు జరుగుతుందని, ఆరోగ్యంగా ఉంటామన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గురువారం అంబర్ పేట మున్సిపల్ మైదానంలో ఇనిస్ట్యూట్ ఫర్ కల్చరల్ ట్రైనింగ్ ఫౌండేషన్, అంబర్ పేట మండలం గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా శిబిరానికి ఆయన హాజరై మాట్లాడారు..యోగ ద్వారా విద్యార్థులు చురుకుగా ఉంటారని చదువులో కూడా రాణించే అవకాశాలు ఉన్నాయన్నారు. చిన్నపెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరు రోజూ ఒక గంట లేదా అరగంట యోగా చేస్తే శరీరానికి చాలా మంచిదని, చిన్న చిన్న జబ్బులు కూడా యోగాతో ఇట్టే తగ్గిపోతాయన్నారు.మనిషి శరీరం బాగుంటేనే మనం ఎన్నోరకాల కార్యక్రమలు చేయగలమని అందుకు యోగా తప్పకుండా చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరికి యోగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బి.పద్మావెంకట్ రెడ్డి, పలు పాఠశాలల కరస్పాడెంట్లు సాధుల మధుసూదన్ , ఆవుల నిరంజన్, కెంచె రవికుమార్, రాజశేఖర్ , శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ సత్య రెడ్డి , ఐఎంసీటీఎఫ్ ప్రెసిడెంట్ కాంతా రెడ్డి తో పాటు పలు పాఠశాలల టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.




యోగా శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

## పిల్లల శారీరక ఎదుగుదలకు డీ వార్మింగ్ టాబ్లెట్స్ దోహదం

### ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 20: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం అంబర్ పేట పోలీస్ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులకు కార్పొరేటర్ బి.పద్మావెంకట్ రెడ్డి తో కలసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆల్బెండజోల్ టాబ్లెట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. .ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని విద్యార్థులకు సూచించారు.పిల్లల శారీరక ఎదుగుదలకు సంబంధించి డీ వార్మింగ్ టాబ్లెట్స్ ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఒకటి నుంచి 19 సంవత్సరాలు ఉన్న బాల బాలికలు నులిపురుగుల బారిన పడే అవకాశం ఉంటుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వ్యాధి నివారణకు మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ హై స్కూల్ ప్రిన్సిపల్ తో పాటు డాక్టర్ దీప్తి పటేల్, డాక్టర్ హర్షిత, డాక్టర్ హరి శ్రీ, తదితరులు పాల్గొన్నారు.




పోలీస్ బాయ్స్ స్కూల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్‌లను వేస్తోన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

# సెల్యూట్ తెలంగాణ..

## బేగంపేటలో కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు గ్రాండ్ వెల్‌కమ్




ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 20: తెలంగాణలో బీజేపీని అన్ని వర్గాలు ఆదరించాయని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఓట్ల శాతాన్ని 35 శాతానికి పెంచి జాతీయ స్థాయిలో అందరి దృష్టిని ఆకర్షించేలా చేసిన పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలకు ఈ సందర్భంగా తెలంగాణ బీజేపీ తెలంగాణ తరపున సెల్యూట్ చేస్తున్నానని చెప్పారు. కేంద్రమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారి గురువారం రాష్ట్రానికి వచ్చిన కిషన్‌రెడ్డికి బేగంపేట ఎయిర్‌పోర్టులో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా మహిళా నేతలు ఆయనకు హారతులు ఇచ్చి వీరతిలకం దిద్దారు. అనంతరం పార్టీ ఆధ్వర్యంలో 'సెల్యూట్ తెలంగాణ' పేరుతో నిర్వహించిన ర్యాలీలో కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తోపాటు ఇటీవల ఎన్నికైన ఎంపీలు, బీజేపీ ముఖ్య నేతలు నాంపల్లి బీజేపీ కార్యాలయానికి ర్యాలీగా చేరుకున్నారు.. ఈ సందర్భంగా దారిపొడవునా ప్రజలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి రసూల్‌పుర, ప్యారడైజ్, రాణిగంజ్, కవాడిగూడ, ఆర్టీసీ క్రాస్ రోడ్డు, నారాయణగూడ, హిమాయత్‌నగర్ మీదుగా బీజేపీ స్టేట్ ఆఫీస్ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం పార్టీ ఆఫీస్‌లో కేంద్రమంత్రులు, బీజేపీ ఎంపీలకు సన్మాన చేశారు. అనంతరం వారు భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు.



జాతీయ నూరు పురుగుల నిర్మూలన దినం సందర్భంగా గోల్నాక డివిజన్ లోని తులసి రామ్‌నగర్ లంక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్‌లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్

**- ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 20**



మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు తలసాని శంకర్ యాదవ్ దశదిన కర్మను గురువారం సికింద్రాబాద్ ఎస్వీఐటీ కన్వెన్షన్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ హాజరై...దివంగత శంకర్ యాదవ్ ఫోటో వద్ద నివాళులు అర్పించారు.

**- ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 20**

# కొత్త బీర్ బ్రాండ్లపై ఎక్సైజ్ శాఖ ఎంక్వైరీ

## త్వరలోనే ప్రభుత్వానికి రిపోర్ట్

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 20: రాష్ట్రంలో ఆరు బ్రీవరీల ద్వారా రోజుకు 2 లక్షల కేసులు బీరు ఉత్పత్తి అవుతుంది. సాధారణంగా అయితే ఈ 2 లక్షల కేసుల బీరు మద్యం ప్రియుల అవసరాలకు సరిపోతుంది. కానీ వేసవి కాలంలో తాగే వారి సంఖ్య పెరుగుతుండడంతో అందుకు తగ్గట్టుగా సరఫరా కూడా పెరగాల్సి ఉంది. ఇక్కడ ఉన్న బ్రీవరీలకు మూడో షిఫ్ట్ ఉత్పత్తికి అనుమతి ఇవ్వడంతో పాటు గోవా, బెంగళూరు, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి కూడా బీర్లు దిగుమతి చేసుకుంటారు. అయితే ఇటీవల బీరు కొరత ఏర్పడటంతో డిమాండ్‌కు తగినంత సరఫరా లేదు. లోక్‌సభ ఎన్నికల నియమావళి దృష్ట్యా మూడో షిఫ్ట్‌కు అనుమతి ఇచ్చే అవకాశం లేకపోవడమే కాకుండా బయట రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకునే వెసులుబాటు లేకుండా పోయింది. ఇందుకు తోడు మద్యం దుకాణాల్లో బీరు స్టాక్‌ను నేరుగా విక్రయాలు జరపకుండా కొందరు దుకాణదారులు ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు బెల్ట్ షాపులకు అమ్ముకున్నట్లు ఎక్సైజ్ అధికారుల పరిశీలనలో వెల్లడైంది. మొత్తం మీద మద్యం ప్రియులకు బీరు దొరకడం లేదన్న విషయం పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో ఇటీవల తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ 5 కొత్త బీరు బ్రాండ్లకు అనుమతి ఇచ్చింది. బీరు బ్రాండ్లకు అనుమతుల విషయంలో ప్రభుత్వంతో సంప్రదించకుండానే బేవరేజెస్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించారు.



కనీసం ఆ శాఖ మంత్రి దృష్టికి కూడా తీసుకురాకుండా వారే ధరలు నిర్ణయించి, అనుమతులిచ్చారు. సాధారణంగా ఇక్కడ తయారవుతున్న వివిధ రకాల బీరు బ్రాండ్లకు సంబంధించి 12 బాటిళ్ల బీరు కేసుకు ప్రాథమిక సగటు ధర రూ.291గా ఉన్నట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. కానీ, టీడీబీసీఎల్ మాత్రం ఓ కంపెనీ బీరు కేసుకు ఏకంగా రూ.907గా ప్రాథమిక ధరను నిర్ణయించింది. ఇదే విషయమై సామాజిక మాధ్యమాలు, ప్రతిపక్ష పార్టీలు దుమ్మెత్తి పోశాయి. కొత్త బీర్లకు అనుమతులు ఇవ్వడం వివాదస్పదమై ప్రభుత్వం ఇరకాటాన పడే పరిస్థితికి రావడంతో తాత్కాలికంగా రద్దు చేసినట్లు తెలుస్తోంది.

# కాంగ్రెస్‌లో కేబినెట్ విస్తరణ సందడి

## నాలుగైదు పదవులు భర్తీ చేసే ఛాన్స్

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 20: తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మంత్రి పదవుల హడావుడి కనిపిస్తోంది. రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో ప్రస్తుతం పన్నెండు మంది మాత్రమే ఉన్నారు. మరో ఆరుగురికి అవకాశం ఉంది. పార్లమెంట్ ఎన్నికలు అయిపోయిన తరవాత విస్తరణ చేపట్టాలని అనుకున్నారు. పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో విస్తరణపై దృష్టి పెట్టారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే కాంగ్రెస్ హైకమాండ్‌తో మంతనాలు జరిపారని గ్రీన్ సిగ్నల్ వచ్చినట్టు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

**అసెంబ్లీ సమావేశం కంటే ముందే మంత్రివర్గ విస్తరణ**

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల కంటే ముందే విస్తరణ ఉండే అవకాశం ఉంది. రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో కొన్ని జిల్లాలకు ఎక్కువ ప్రాతినిధ్యం దక్కగా, కొన్ని జిల్లాలకు అసలు చోటు లేదు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు సంబంధించిన నేతలెవ్వరూ లేరు. ఎమ్మెల్యేలు



గెలవకపోవడమే దీనికి కారణం. ఈసారి ఆయా జిల్లాలకు ఛాన్స్ ఇవ్వాలని అనకుంటున్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ముదిరాజ్‌లకు ప్రాతినిధ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు కాంగ్రెస్ పెద్దలు. వారిలో ముక్తల్ నుంచి శ్రీహరికి రావచ్చని అంటున్నారు. రాజగోపాల్ రెడ్డి, గడ్డం వివేక్, ప్రేమసాగర్, సుదర్శన్‌రెడ్డి, మైనార్టీల నుంచి ఒకరు పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఒక స్థానాన్ని ఖాళీగా ఉంచాలని రేవంత్ అనుకుంటున్నారు.

**మంత్రి పదవుల కోసం భారీ పోటీ**

పలువురు నేతలు మంత్రి వర్గంలో స్థానంలో కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. హైకమాండ్ వద్ద లాబీయింగ్ చేసుకుంటున్నారు. మరో వైపు పార్టీలో చేరిన వారికీ చాన్స్ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ పెద్దగా విజయం సాధించలేదు. దీంతో పార్టీలో చేరిన వారికి చాన్స్ ఇస్తారని అంటున్నారు. సికింద్రాబాద్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన దానం నాగేందర్ పేరును పరిశీలిస్తున్నారు. అయితే ఓ పార్టీ తరపున గెలిచిన ఎమ్మెల్యేను మరో పార్టీ ప్రభుత్వంలో ప్రమాణం చేయించేందుకు గవర్నర్ అంగీకరిస్తారా అన్న సందేహాలు ఉన్నాయి.

**స్థానికసంస్థల ఎన్నికల నిర్వహణపై కసరత్తు**

స్థానిక సంస్థల ఎన్నికలను అసెంబ్లీ బడ్జెట్ తర్వాత నిర్వహించాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఇప్పటికే స్థానిక సంస్థల పదవీ కాలం ముగిసింది. ప్రత్యేకాధికారుల పాలనలో స్థానిక సంస్థలు ఉన్నాయి. ఈ ఎన్నికలు పూర్తి చేస్తే ఇక పూర్తి స్థాయిలో పాలనపై దృష్టి పెట్టవచ్చని రేవంత్ రెడ్డి అనుకుంటున్నారు. అయితే మంత్రి పదవుల భర్తీ పెను సవాల్ గా మారనుంది. సీనియర్లు అసంతృప్తికి గురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మిగతా..

## సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో అగ్నిప్రమాదం..ఆగి ఉన్న రైలు బోగీల్లో చెలరేగిన మంటలు



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 20:** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఆగి ఉన్న రైలు బోగీల్లో మంటలు చెలరేగాయి. గురువారం ఉదయం 11 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. వాషింగ్‌కి వెళ్లి ప్లాట్‌ఫామ్‌పైకి వస్తున్న అదనపు ఏసీ బోగీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా భారీగా మంటలు అంటుకున్నాయి. ఇక రైలు బోగీల్లో మంటలు చెలరేగడం గమనించిన సిబ్బంది వెంటనే అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైరింజన్లతో ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అర్పివేశారు. కాగా, ప్రమాదం సమయంలో రైలు బోగీల్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. ఈ ప్రమాదంలో రెండు బోగీలు పూర్తిగా దగ్ధం అయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఏపీ ప్రొటెం స్పీకరుగా బుచ్చయ్య చౌదరి ...ప్రమాణం చేయించిన గవర్నర్




**ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, జూన్ 20:** ఏపీ అసెంబ్లీ ప్రొటెం స్పీకరుగా బుచ్చయ్య చౌదరి ప్రమాణ స్వీకారం చేశారు. బుచ్చయ్య చౌదరితో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించారు. ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారానికి మంత్రులు నాదెండ్ల మనోహర్, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు వెళ్లారు. రేపు ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ బుచ్చయ్య చౌదరి ప్రమాణ చేయించనున్నారు. గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఇప్పటివరకు ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయనకు ప్రొటెం స్పీకర్‌గా అవకాశం కల్పించారు. ఏపీ అసెంబ్లీ సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి.

## 16 సీట్లతో టీడీపీ సాధించింది - కేటీఆర్ కీలక వ్యాఖ్యలు



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్ , జూన్ 20:** బీఆర్ఎస్‌కు పదహారు సీట్లు వస్తే ఏం చేసుకుంటారని సీఎం రేవంత్ రెడ్డి లోక్ సభ ఎన్నికల సమయంలో మాట్లాడారని ఇప్పుడు ఏపీలో టీడీపీ పార్టీకి 16ఎంపీ సీట్లు వచ్చాయని.. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా ఆపగలిగిందని అన్నారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన కేటీఆర్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, సింగరేణి పై కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ పార్టీ ఒక రక్షణ కవచం, శ్రీరామరక్ష అని కేసీఆర్ ఈ 25 ఏండ్లలో ఒక్కసారి కాదు వేల సార్లు చెప్పారని గుర్తు చేశారు. కానీ ఇవాళ ఏం జరిగిందని ప్రశ్నించారు. కేసీఆర్ 16 పార్లమెంట్ సీట్లు ఇవ్వండి అని మొత్తుకున్నారు ..కేంద్రంలో నిర్ణయాత్మక పాత్రలో ఉంటామని చెప్పారు. 16 ఎంపీలతో ఏం చేస్తారని సీఎం రేవంత్ రెడ్డితో సహా చాలా మంది చాలా మాట్లాడారన్నారు. కానీ ఇవాళ ఏపీలో 16 ఎంపీ సీట్లు గెలిచిన తెలుగు దేశం పార్టీ నిర్ణయాత్మక పాత్రలో ఉంది. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ ఆగిపోయింది. ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీ కలిసి సింగరేణిని ఖతం చేసే ప్రయత్నం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 8 స్థానాలు గెలిచిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు సింగరేణి బొగ్గు గనులను ప్రైవేట్ పరం చేస్తున్నాయని మండిపడ్డారు. ఉద్దేశ పూర్వకంగా సింగరేణికి కోల్ బ్లాక్స్ కేటాయించడం లేదని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి బొగ్గు గనుల యాక్షన్‌ను ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నించారు. 16ఎంపీల పవర్ ఏంటో ఏపీని చూస్తే తెలుస్తుందని ఉద్ఘాటించారు. రేవంత్ ఎందుకు ఆపడం లేదు. కేసుల భయమా? అని ఎద్దేవా చేశారు. సింగరేణి మెడ మీద కేంద్రం కత్తి పెడితే సీఎం రేవంత్ ఆ కత్తికి సాన పడుతున్నారని ఎద్దేవా చేశారు. సింగరేణికి ప్రమాదం వస్తే కాపాడేది బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. సింగరేణిని కార్పొరేట్ గద్దలకు అ ప్ప గి ం చ ట ా న్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ నిర్ణయాన్ని అడ్డుకుంటామన్నారు. వేలంలో పాల్గొనే వారు ఆలోచించాలని కోరారు. ఈ నిర్ణయాన్ని కేంద్రం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఒరిస్సా, గుజరాత్‌లో ప్రభుత్వ సంస్థలకు ఇచ్చి ఇక్కడ సింగరేణికి బొగ్గు బ్లాక్స్ ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. సింగరేణి వేలంలో ఎందుకు పాల్గొనాలని నిలదీశారు. ఇక్కడ ఉన్న ఎంపీలు చేత కానివారా అని కేటీఆర్ మండిపడ్డారు.

## ఏపీ అసెంబ్లీ సమావేశాల వేళ కీలక నిర్ణయం.. వారికి కూడా నో ఎంట్రీ..

- నేటి నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు
- శుక్రవారం ఉదయం 9.46 నిమిషాలకు ఏపీ శాసన సభ ప్రారంభం




**ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, జూన్ 20:** ఏపీ అసెంబ్లీ సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. శుక్రవారం ఉదయం 9.46 నిమిషాలకు ఏపీ శాసన సభ ప్రారంభం కానుంది. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలో వచ్చిన తర్వాత తొలిసారి శాసనసభ సమావేశాలు జరగనున్నాయి. రెండు రోజుల పాటు సభా కార్యక్రమాలు జరగనున్నాయి. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం, స్పీకర్ ఎన్నిక ఉండనున్నాయి. ఇందుకోసం ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. ప్రొటెం స్పీకర్‌గా గోరంట్ల బుచ్చయ్య చౌదరి.. సభ్యులతో ప్రమాణం చేయించనున్నారు. నేడు సభ్యులతో ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయించనున్నారు. తొలుత ముఖ్యమంత్రి చంద్రబాబు, అనంతరం డిప్యూటీ సీఎంలు ప్రమాణం చేయనున్నారు. సాధారణ సభ్యుడిగానే వైసీపీ అధినేత జగన్ ప్రమాణం చేయనున్నారు. ప్రతిపక్ష హోదా లేకపోవడంతో సాధారణ సభ్యుడిగానే జగన్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆంగ్ల అక్షరాల ప్రాతిపదిక వరుస క్రమంలో ఎమ్మెల్యేలు ప్రమాణం చేయనున్నారు. అయితే నేటి నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాలకు విజిటింగ్ పాసులు రద్దు చేశారు. ఈ విషయాన్ని ఏపీ శాసనసభ అధికారులు వెల్లడించారు. అసెంబ్లీలో స్థలాభావం కారణంగా విజిటింగ్ పాసులు రద్దు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు కూడా విజిటింగ్ పాసులు ఇవ్వట్లేదని వెల్లడించారు. విజిటింగ్ పాసులు రద్దు చేయడంతో ఎమ్మెల్యేల కుటుంబసభ్యులు కూడా అసెంబ్లీలోకి వెళ్లే అవకాశం ఉండదు. తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన తమవారు ప్రమాణ స్వీకారం చేస్తుంటే ప్రత్యక్షంగా చూసే అవకాశం వారి కుటుంబసభ్యులకు ఉండదు.

## న్యాయంగా, ధర్మంగా చూస్తే మనం ఓడిపోలేదు..

### వైసీపీ విస్తృత స్థాయి సమావేశంలో జగన్



**ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, జూన్ 20:** వైసీపీ అధినేత జగన్ గురువారం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. నేతలకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అనేక పథకాలు ఇచ్చాం, ఇంటింటికీ సంక్షేమాన్ని అందించాం... అయినా ఓడిపోయాం... ప్రజలకు వివిధ రకాల లబ్ధి చేకూర్చిన తర్వాత వచ్చిన ఫలితాలు ఆశ్చర్యానికి గురిచేశాయి... ఈ ఫలితాలు శకుని మాయా పాచికలను గుర్తుకు తెచ్చాయి.... ఈ ఎన్నికల ఫలితాలు శకుని మాయా పాచికల మాదిరిగా ఉన్నాయి.. కానీ ఆధారాలు లేకుండా ఏం మాట్లాడగలం? అని జగన్ విచారం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఓడిపోయామన్న భావనను మనసులోంచి తొలగించండి... న్యాయంగా, ధర్మంగా చూస్తే మనం ఓడిపోలేదు, ప్రతి ఇంట్లోనూ మనం చేసిన మంచి ఉంది, ప్రతి ఇంటికీ మనం ధైర్యంగా వెళ్లగలం అని జగన్ స్పష్టం చేశారు. 2019తో పోల్చితే ఈ ఎన్నికల్లో వైసీపీకి 10 శాతం ఓట్లు తగ్గాయని, ఆ 10 శాతం ప్రజలు కూడా త్వరలోనే చంద్రబాబు మోసాలను గుర్తిస్తారని అన్నారు. కాలం గడిచే కొద్దీ ప్రజల్లో వైసీపీపై అభిమానం వ్యక్తమవుతుందని, 2029 నాటికి ప్రజలే రెట్టించిన ఉత్సాహంతో మళ్లీ వైసీపీని అధికారంలోకి తెచ్చుకుంటారని జగన్ ధీమా వ్యక్తం చేశారు. “అసెంబ్లీలో మన బలం తక్కువ. కాబట్టి అసెంబ్లీలో మనం చేయగలిగింది కూడా పెద్దగా ఏమీ ఉండదు. అందుకే మనం ప్రజలకు చేరువ అవుదాం. నాకు వయసుతో పాటు సత్తువ కూడా ఉంది. ప్రజలకు దగ్గరయ్యేందుకు నేను మరింతగా పోరాడగలను. ప్రజాపోరాటాల్లో వైసీపీకి, ఈ జగన్ కు ఎవరూ సాటిరారని అన్నారు. . చంద్రబాబు పాపాలు కూడా పండుతున్నాయి. ఇకపై ప్రజలకు మరింత దగ్గరయ్యే కార్యక్రమాలు చేద్దాం. రాబోయే రోజుల్లో నేను కార్యకర్తలకు భరోసా ఇచ్చేందుకు వస్తాను. నష్టపోయిన ప్రతి కార్యకర్తను కలిసి ధైర్యం నింపుతామని తెలిపారు. .

## ఇవాళ నా మనసంతా బాధతో నిండిపోయింది: సీఎం చంద్రబాబు



**ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, జూన్ 20:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో శంకుస్థాపన జరిగిన ప్రాంతాన్ని, రాజధానిలో వివిధ నిర్మాణాలను గురువారం పరిశీలించారు. అమరావతి రాజధాని శిలాఫలకం, సీడ్ యాక్సెస్ రోడ్డు, ఆలిండియా సర్వీసెస్ అధికారుల గృహ సముదాయాలు, మంత్రులు, జడ్జిల గృహ సముదాయాలు, ఐకానిక్ నిర్మాణాల సైట్లు, రాజధాని ప్రాంతంలోని ఇతర నిర్మాణాల స్థితిగతులను చంద్రబాబు పరిశీలించారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజధాని రైతులకు నమస్కారాలు తెలిపారు. “అమరావతి రైతులు 1,631 రోజులుగా ఆందోళనలు చేపట్టి, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ అభివృద్ధి జరుగుతుందన్న నమ్మకంతో ఆందోళనలు విరమించారు. ఇక్కడి రైతులు చేపట్టిన ఉద్యమం ప్రపంచంలో ఒక చరిత్ర. ఒక రాజధాని కోసం సుదీర్ఘ పోరాటం చేసిన ఘనత ఇక్కడుండే రైతులకే దక్కుతుంది. వారికి మనస్ఫూర్తిగా అభినందనలు. మీరు పోరాడిన తీరు భావితరాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తుంది. అమరావతి అనగానే ప్రపంచం అంతా గుర్తించే పరిస్థితికి వచ్చారు. ఐదు కోట్లమంది ప్రజలకు దశ, దిశ నిర్దేశించే రాజధానిగా, పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దాలని అనుకున్నాం. అలాంటి రాజధానిని అతలాకుతలం చేశారు. పోలవరంను కూడా నాశనం చేశారని అన్నారు.. దక్షిణ భారతదేశంలో ఎక్కువ నీళ్లు ఉండే నది గోదావరి. పోలవరం పూర్తి చేసి, నదులు అనుసంధానం చేయగలిగితే రాష్ట్రంలో ప్రతి ఒక్క ఎకరాకు నీళ్లు ఇచ్చే వీలుంటుంది. నాడు రాష్ట్ర విభజన జరిగితే, హేతుబద్ధత లేదని పోరాడాం. బలమైన ఆర్థిక నగరం హైదరాబాద్ తెలంగాణకు వెళుతుంది... పోలవరం పూర్తి చేస్తే ఈ రాష్ట్రానికి కొంతవరకు వెసులుబాటు వస్తుందన్న ఉద్దేశంతో అమరావతిని, పోలవరం ప్రాజెక్టును విభజన చట్టంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. పోలవరంను జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి, అమరావతి రాజధానికి ఆర్థికసాయం చేసేందుకు నాటి కేంద్రం ముందుకు వచ్చింది. అయితే, వైసీపీ ప్రభుత్వం ఈ రెండింటిని భ్రష్టు పట్టించింది.

## కేంద్రం ద్వంద్వ వైఖరి అవలంబిస్తుంది..మంత్రి శ్రీధర్ బాబు



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 20:** కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కి మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చారు. గురువారం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సింగరేణి కేంద్ర.. రాష్ట్ర ప్రభుత్వంకి సంబంధించిందని ఆయన అన్నారు. సింగరేణికే గనులు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తున్నట్టు స్టేట్మెంట్ ఇచ్చారు కిషన్ రెడ్డి అని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలకే బొగ్గు గనుల కేటాయింపు జరగాలన్నారు. కేంద్ర నిర్ణయం సరికాదు.. రాష్ట్రంలో ఉన్న గనులు%ా% ప్రభుత్వ సంస్థలకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రం ద్వంద్వ వైఖరి అవలంబిస్తుందని, సీఎం త్వరలో ప్రధాని ని కలుస్తారని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్ర సమస్యలు..సహకారం.. సింగరేణి అంశాలు ప్రధాని దృష్టికి తీసుకెళ్తారని, వేలంలో పాల్గొనాలో వద్దో నిర్ణయం తీసుకుంటుందని ఆయన తెలిపారు. మా ఆలోచన సింగరేణి సంస్థ కి చెప్పామని శ్రీధర్ బాబు అన్నారు. శాంతి భద్రతల విషయం లో కఠినంగా ఉంటామని, ఉక్కుపాదం తో అణచివేస్తామని ఆయన తెలిపారు. ఏపీ ప్రభుత్వం నుండి నేర్చుకోవాల్సిన అవసరం మాకు లేదని, బీఆర్ఎస్ ఆలోచన చూస్తుంటే జాలి వేస్తుందని ఆయన అన్నారు. టీడీపీ నుండి నేర్చుకోవాలని అనుకుంటున్నారు వాళ్ళు అని ఆయన వ్యాఖ్యానించారు.

## పాడైపోయిన మటన్‌తో బిర్యానీ - సికింద్రాబాద్ ఆల్ఫా హొటల్‌పై కేసు, జరిమానా

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్ , జూన్ 20:** ఇటీవల నగరంలోని పలు హొటళ్లలో టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. బుధవారం రాత్రి సికింద్రాబాద్ ఆల్ఫా హొటల్‌లో సోదాలు చేసిన అధికారులు.. నాసిరకం ఆహార పదార్థాలు వాడుతున్నట్లు గుర్తించారు. పాడైపోయిన మటన్‌తో బిర్యానీ వండుతున్నట్లు గమనించారు. ఫుడ్ ముందుగానే తయారుచేసి ఫ్రిడ్జ్‌లో పెట్టి కస్టమర్లు వచ్చిన వేళ దాన్ని అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఆల్ఫా హొటల్‌లో తయారు చేసే బ్రెడ్‌తో పాటు ఐస్‌క్రీమ్ డేట్ బ్యాచ్ లేకుండా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. టీ పౌడర్ కూడా నాసిరకంగా ఉన్నట్లు గుర్తించారు. కిచెన్‌లో అపరిశుభ్రంగా దారుణ పరిస్థితులు ఉన్నట్లు వెలుగులోకి తెచ్చారు. ఈ క్రమంలో నిర్వాహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన అధికారులు హొటల్‌పై కేసు నమోదు చేసి రూ.లక్ష జరిమానా విధించారు.



## నితిన్ గడ్కరితో కిషన్ రెడ్డి సమావేశం.. ప్రాజెక్టుల అభివృద్ధిపై చర్చ

**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ , జూన్ 20:** కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. గురువారం ఢిల్లీలో గడ్కరీని కలికి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్రంలో రోడ్ల మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు.



# పుతిన్‌కు అరుదైన శునకాలను గిఫ్ట్ ఇచ్చిన కిమ్



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 20:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు అరుదైన కొరియన్ జాతి శునకాలను కిమ్ జాంగ్ ఉన్ గిఫ్ట్‌గా ఇచ్చారు. ప్యోంగ్‌యాంగ్‌లో చర్చలు జరిగిన సమయంలో ఇద్దరు నేతలు ఒకరి ఒకరు పలు రకాల బహుమతులను ఇచ్చి పుచ్చుకున్నారు. 2000 సంవత్సరం తర్వాత రష్యా అధ్యక్షుడు పుతిన్ తొలిసారి ఉత్తర కొరియా పర్యటించారు. ఆయన రెండు ఆసియా దేశాల పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. ఆర్థిక, భద్రతా, రాజకీయ అంశాలపై ఆ ఇద్దరు నేతలు చర్చించుకున్నారు. ఫుంగ్‌సన్ జాతికి చెందిన శునకాలను పుతిన్‌కు గిఫ్ట్ ఇచ్చారు. కొరియా ద్వీపకల్పంలో ఉత్తర దిక్కున్న కొండ ప్రాంతాల్లో ఫుంగ్‌సన్ జాతి శునకాలు నివసిస్తుంటాయి. మంచును తట్టుకునే చర్మం వాటికి ఉంటుంది. పెద్ద పెద్ద జంతువులను కూడా అవి ఢీకొట్టగలవు. కొరియాలో వీటిని హంటింగ్ డాగ్స్ వాడుతుంటారు. ప్యోంగ్‌యాంగ్‌లో భారీ ఎత్తున పుతిన్‌కు కిమ్ వెల్కమ్ పలికిన విషయం తెలిసిందే.

## ప్రాణం తీసిన 'రీల్స్' సరదా..
## ఉరి వేసుకుంటున్నట్లు వీడియో తీయబోయాడు! కానీ అంతలోనే..




**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 20:** రీల్స్ మోజు యువకుడి ప్రాణాలు తీసింది. సరదాగా మెడకు ఉరిని వేసుకుని ఫొటోకు ఫోజులివ్వబోయాడు. కానీ అనుకోకుండా అది మెడకు బిగించుకుని ప్రాణాలు పోగొట్టుకున్నాడు. రాత్రి సమయంలో కావడంతో ఎవరూ గమనించలేదు. దీంతో యువకుడు మృతి చెందాడు. తెల్లారి నిద్రలేచిన తల్లిదండ్రులు ఉరికొయ్యకు వేలాడుతూ కొడుకు కనిపించడంతో గుండెలవిసేలా రోధించారు. ఈ విషాద ఘటన వరంగల్ జిల్లా, నర్సంపేటకు మండలంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.వరంగల్ జిల్లా, నర్సంపేటకు మండలం నర్సంపేటకు చెందిన కందకట్ల అజయ్ (23) అనే యువకుడు స్థానికంగా ఓ హెూటల్‌లో పని చేస్తుంటాడు. ఖాళీ సమయాల్లో అతడికి మొబైల్‌తో రీల్స్ చేసే అలవాటు ఉంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇంటికి వచ్చిన అజయ్.. మల్లంపల్లి రోడ్డులోని తన చిన్నక్క ఇంటికి వచ్చాడు. ఉరి వేసుకుంటూ సెల్‌ఫోన్‌లో వీడియో చిత్రీకరించాలనే ఉద్దేశంతో ఫ్రిజ్‌పై సెల్‌ఫోన్‌ని అమర్చి దూలానికి ఉరి తాడు వేశాడు. అనంతరం ఉరి ఉచ్చును తలకు వేసుకుని వీడియో చిత్రీకరిస్తూ ఉన్న క్రమంలో.. అనుకోకుండా మెడకు ఉరి బిగుసుకుంది. ఊపిరి ఆడకపోవడంతో కొద్ది సేపటికే అజయ్ మృతి చెందాడు. బుధవారం ఉదయం నిద్రలేచిన కుటుంబ సభ్యులు అజయ్ మృతదేహాన్ని చూసి కన్నీరు మున్నీరుగా విలపించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించడంతో.. వారు ఘటనా స్థలంలో సెల్‌ఫోన్‌ని స్వాధీనం చేసుకున్నారు. తన కుమారుడి మృతిపై అనుమానం ఉందంటూ అజయ్ తల్లి దేవమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## ఇది రియల్ దృశ్యం.. డ్యాములో మునిగిన కారు.. చూస్తే...లేచిపోయిన బావామరదళ్ళ అస్థిపంజరాలు



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 20:** మలయాళంలో మోహన్ లాల్, తెలుగులో వెంకటేష్ హీరోలుగా నటించిన దృశ్యం 2 సినిమాలోని ఒక సీన్ రిపీట్ అయింది. ఈ సినిమాలో కారును ఒక నీటి సంపులో దాస్తాడు హీరో. చాలా కాలానికి ఆ కారు బయటపడుతుంది. ఇప్పుడు మధ్యప్రదేశ్‌లోని మొరెనా జిల్లాలో అలాంటిదే ఒక ఘటన వెలుగులోకి వచ్చింది. మొరెనా జిల్లాలో ఒక స్టాప్ డ్యామ్‌లో మునిగిన కారులో నుండి ఒక వివాహిత, ఆమె బావమరిది ఛిద్రమైన మృతదేహాలు(అస్థిపంజరాలు) వెలికితీయడం సంచలనం రేపింది. స్టాప్ డ్యామ్ నీటి మట్టం తగ్గిన తర్వాత, ఒక గ్రామంలోని నివాసితులు అస్థిపంజరాలుగా మారిన వారి మృతదేహాలను కలిగి ఉన్న కారును చూశారు. సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలు మిథిలేష్ జాదవ్ (30), ఆమె బావ నీరజ్ సఖ్వార్ (34)గా గుర్తించారు. మిథిలేష్ మరియు నీరజ్ ఒకరికి ఒకరు ప్రేమించుకుంటున్నారని, ఫిబ్రవరిలో వారి ఇంటి నుంచి పారిపోయారని చెబుతున్నారు. గోపి గ్రామంలోని క్వారీ నదిపై నిర్మించిన స్టాప్ డ్యామ్‌లో లభించిన కారులో ఇద్దరి అస్థిపంజరాలను స్వాధీనం చేసుకున్నట్లు సిహెూనియా పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ ధర్మేంద్ర గౌర్ తెలిపారు. వాస్తవానికి, ప్రతి సంవత్సరం స్టాప్ డ్యామ్ నుంచి నీటిని శుభ్రం చేయడానికి నీటిని విడుదల చేస్తారు. నీటిమట్టం తగ్గడంతో మంగళవారం మధ్యాహ్నం స్టాప్ డ్యాం నుంచి నీటిని విడుదల చేయగా.. మధ్యలో ఓ కారు కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసు బృందం సంఘటనా స్థలానికి చేరుకుని స్టాప్ డ్యామ్ మధ్యలో కారును చూసింది. బాగా కుళ్లిపోయిన మృతదేహాలు స్త్రీ, పురుషుడివని గుర్తించారు.మృతుడు నీరజ్ సఖ్వార్‌కు మిథ్లేష్ మరదలు అని తేలింది. వారిద్దరూ ఒకరినొకరు ప్రేమించుకుంటున్నారని, ఫిబ్రవరి 6న ఇంటి నుంచి పారిపోయారని వారి కుటుంబ సభ్యుల విచారణలో తేలింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో మిథిలేష్ భర్త ముఖేష్ సఖ్వార్ తన భార్య మార్కెట్‌కు వెళ్లిందని, ఆపై ఆమె బంధువు నీరజ్‌తో కలిసి అక్కడి నుంచి పారిపోయిందని ఫిర్యాదు చేశాడు. వారు తిరిగి వస్తారని కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నందున ఫిబ్రవరి 14న రిపోర్ట్ చేశారు. ఒక పోలీసు అధికారి మాట్లాడుతూ, కారు స్టాప్ డ్యామ్‌లో ఎప్పుడు, ఎలా పడిపోయింది అనే సహా అన్ని కోణాల్లో పోలీసులు కేసును దర్యాప్తు చేస్తారని తెలిపారు

## నిప్పుల కొలిమిలా "హజ్ యాత్ర"..
### 68 మంది భారతీయులతో పాటు 1000కి పైగా మృతి..



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 20:** ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే "హజ్ యాత్ర" యాత్రికులు పిట్టల్లా రాలిపోతున్నారు. దారుణమైన వేడి కారణంగా మరణాలు సంభవిస్తున్నాయి. ఇప్పటివరకు 68 మంది భారతీయులతో పాటు కనీసం 1000 మంది వరకు వేడి కారణంగా మరణించినట్లు రిపోర్టులు తెలుపుతున్నాయి. గురువారం కొత్తగా నమోదైన మరణాల్లో ఈజిప్ట్ దేశానికి చెందిన 58 మంది ఉన్నారు. ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్లిన వారిలో మరణించిన వారి సంఖ్య 1000ని దాటింది. ఈజిప్ట్ నుంచే ఎక్కువ మంది మరణించిన వారు ఉన్నారు. ఈ ఒక్క దేశం నుంచే 658 మంది మరణించారు. మరణించిన 630 మందిని గుర్తించాల్సి ఉంది. ఇండియా నుంచి యాత్రకు వెళ్లిన వారిలో 68 మంది మరణించినట్లు సౌదీ దౌత్యవేత్తలు చెప్పారు. వేడి కారణంగానే మరణాలు చోటు చేసుకుంటున్నట్లు సౌదీ అధికారులు వెల్లడించారు. మరణించిన వారిలో ఇండోనేషియా, ఇరాన్, సెనెగల్, ట్యునీషియా, ఇరాక్ దేశాలకు చెందిన వారు ఉన్నట్లు ధృవీకరించారు. గతేడాది 200 మందికి పైగా యాత్రికులు మరణించారు. సౌదీ అరేబియాలో ఆదివారం రోజు 2700 కంటే ఎక్కువ వడదెబ్బ కేసులు నమోదయ్యాయి. ప్రతీ ఏడాది కూడా మరణాలు చోటు చేసుకుంటున్నప్పటికీ, ఈ ఏడాది మాత్రం అనూహ్యంగా మరణాల సంఖ్య 1000ని దాటింది. హజ్ యాత్రకు కేంద్రంగా ఉన్న మక్కాలో ప్రతీ దశాబ్దం ఉష్ణోగ్రత 0.4 డిగ్రీల సెల్సియస్ పెరుగుతోంది.

## మోదీ మానసికంగా కృంగిపోయాడు: రాహుల్ గాంధీ



**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, జూన్ 20:** ప్రధాని మోదీ మానసికంగా బలహీనమైనట్లు రాహుల్ గాంధీ ఆరోపించారు. మోదీ మానసికంగా కుప్పకూలిపోయారన్నారు. ఛత్వాన్ని నడిపించేందుకు ఆయన తెగ ఇబ్బందిపడుతారని రాహుల్ పేర్కొన్నారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ కుంటివాడయ్యారని, విద్యార్థుల గురించి ఆయన ఆందోళన చెందడం లేదని, మానసికంగా కూలిపోయారని, ఎన్నికల్లో మోదీ అనే కాన్సెప్ట్ నాశనమైనట్లు రాహుల్ గాంధీ అన్నారు. ప్రధాని మోదీకి ఎవరూ భయపడడం లేదని, గతంలో ఆయన ఛాతి 56 ఇంచులు ఉండేదని, కానీ ఇప్పుడు ఆ సంఖ్య చెప్పలేనని, మోదీ ఛాతి 32 ఇంచులకు చేరుకున్నదని, భయపెట్టి, బెదిరించి పనిచేయించుకోవడం ఆయనకు అలవాటు అని, ఇప్పుడు ఆ భయం పోయిందని, వారణాసిలో ఒకరు ఆయనపై చెప్పులు విసిరేశారని, ఎన్నికలకు ముందు మాత్రం ఆయన్నుతాకేందుకు జనం వణికేవారన్నారు.నరేంద్ర మోదీ అన్న కాన్సెప్ట్‌ను ప్రతిపక్షాలు ధ్వంసం చేశాయని, ఆయన పని అయిపోయిందరన్నారు. చాలా బలమైన ప్రతిపక్షం ఉందని, ఇది చాలా ఆసక్తికరమైన సమయమన్నారు. నోట్ల రద్దుతో ఎలా ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారో, ఇప్పుడు విద్యా వ్యవస్థకు అదే జరుగుతోందన్నారు. తప్పు చేసిన వారిని శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

## మరణించిన జంటకు పెళ్లి చేసిన ఫ్యామిలీ.. హృదయాన్ని కదిలించే ప్రేమికుల స్టోరీ..




**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 20:** చనిపోయిన వ్యక్తులకు పెళ్లి చేయడం అన్న సంప్రదాయం మన దేశంలో కొన్ని ప్రాంతాల్లో ఉన్న సంగతి తెలిసిందే.. అయితే తాజాగా జరిగిన సంఘటనతో కొన్ని దేశాల్లో కూడా మరణించిన వ్యక్తులకు కుటుంబ సభ్యులు పెళ్లి చేస్తారని తెలుస్తోంది. తాజాగా ప్రమాదంలో ఒకే సారి మరణించిన యువతీ యువకుడికి ఆ రెండు కుటుంబ సభ్యులు కలిసి ఆచార సాంప్రదాయాల ప్రకారం వివాహం చేశారు. ఈ ఘటన మలేషియాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..మలేషియాలో జరిగిన ఘోర కారు ప్రమాదంలో యాంగ్ జింగ్షాన్, లి షుయింగ్ అనే జంట మరణించారు. ఈ సంఘటన మే 24న పెరాక్‌లోని వాయువ్య ప్రాంతంలో జరిగింది. వీరిద్దరూ గత మూడేళ్లుగా రిలేషన్‌షిప్‌లో ఉన్నారని.. త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారని సమాచారం. లీకి తనను పెళ్లి చేసుకోమని ప్రపోజ్ చేయడానికి జింగ్‌షాన్ తన పుట్టినరోజుని ఎంచుకున్నాడు. ఈ మేరకు బ్యాంకాక్‌కు వెళ్లాలని ప్లాన్ కూడా చేసినట్లు తెలుస్తోంది. అయితే దురదృష్టం ఈ జంటను వెంటాడింది. అతను తన ప్రేమని వెల్లడించి పెళ్లి చేసుకోమని అడిగే లోపు కారు ప్రమాదంలో ఇద్దరూ మరణించారు. యాంగ్ జింగ్షాన్, లి షుయింగ్ ప్రయాణిస్తున్న కారు బోల్తా పడింది. ఇప్పుడు ఈ లోకంలో లేరు.సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ నివేదిక ప్రకారం.. ఈ ప్రమాదం తర్వాత, రెండు ఇళ్లలోని కుటుంబాలు కలిసి ఒక ప్రత్యేకమైన ఆచారాన్ని నిర్వహించాలని నిర్ణయించుకున్నాయి. తమ పిల్లల ఆఖరి కోరిక తీర్చేందుకు వారు 'ప్రేత వివాహం' నిర్వహించారు.ఇది చైనాలో ఒక సంప్రదాయం. ఈ సంప్రదాయంలో ఇద్దరు పెళ్లికాని వ్యక్తులు చనిపోతే వారి ఆత్మలను వివాహం అనే పవిత్ర బంధంలో ఒకటి చేస్తారు. ఇలా చేయడం వల్ల చనిపోయిన తర్వాత కూడా ఇద్దరూ భార్యాభర్తలుగా కలకాలం ఉంటారని.. వారి ఆత్మకు శాంతి చేకూరుతుందని నమ్మకం.జింగ్షాన్ , లీ కుటుంబాలు గత సోమవారం అంత్యక్రియల కోసం ఏర్పాటు చేసిన హాలులో ఈ ప్రత్యేకమైన వివాహ వేడుకను నిర్వహించాయి. ఇక్కడ మృతులైన యాంగ్ జింగ్షాన్, లి షుయింగ్ లకు వివాహం జరిపించారు. ఈ పెళ్లి వేడుక కోసం కుటుంబ సభ్యులు పెళ్లి ఫొటో కూడా తయారు చేశారు. జింగ్‌షాన్ కుటుంబం తమ సంతాప సందేశంలో లిని తమ కోడలుగా అంగీకరించింది.

## అక్కకు పిచ్చి ముదిరింది.....! పాముతో పరచకాలాడుతూ వీడియో ..



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 20:** జనాలకు సోషల్ మీడియా పిచ్చి రోజు రోజుకు ఎక్కువైపోతోంది. రీల్స్ చేసి పాపులర్ అవ్వాలని పిచ్చి పిచ్చి పనులు చేస్తున్నారు కొందరు. ఆ మధ్య టిక్ టాక్ యాప్ వల్ల చాలా మంది ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు. రాత్రికి రాత్రే ఫేమస్ అవ్వాలని వింత వింత చేష్టలు చేశారు. ఇక ఇప్పుడు ఇన్ స్టా గ్రామ్ లో రీల్స్ పిచ్చి మొదలైంది. రీల్స్ ద్వారా డబ్బులతో పాటు పాపులారిటీ కూడా వస్తుండటంతో చాలా మంది రకరకాల వీడియోలు చేసి సోషల్ మీడియాలో వదులుతున్నారు. జనాలు కూడా వాటిని ఎగబడి మరీ చూస్తున్నారు. కాగా ఇన్ స్టా గ్రామ్ వల్ల సినిమా అవకాశాలు అందుకున్నావారు కూడా ఉన్నారు. పలు టీవీ షోల్లోనూ కొందరు పాల్గొంటున్నారు. ముఖ్యంగా అమ్మాయిలు హీరోయిన్ రేంజ్ లో క్రేజ్ తెచ్చుకుంటున్నారు. తమలో ఉన్న యాక్టింగ్, డాన్స్, కామెడీ టాలెంట్ ను బయట పెడుతూ అవకంంరాశాలు అందుకుంటున్నవారు కొందరుంటే.. మరికొంతమంది మాత్రం ఇగో ఇలా వింత వింత పనులు చేస్తున్నారు. లైకుల పిచ్చితో కొంతమంది చేసే పనులు నవ్వులు పూయిస్తున్నారు. తాజాగా వైరల్ అవుతున్న వీడియోలో ఓ మహిళ ఇన్ స్టా గ్రామ్ లో ఓ రీల్ చేసింది. ఈ రీల్ లో చేతిలో పామును పట్టుకొని సాంగ్ కు ఎక్స్‌ప్రెషన్స్ ఇచ్చింది. "ప్రేమంటే పామని బెదరాలా.. ధీమాగా తిరగర మగరాయుడా" అంటూ సాగే లిరిక్స్ కు వీడియో చేసింది. ఈ వీడియో ఇప్పుడు వైరల్ అవుతుంది. కాగా ఈ వీడియోను షేర్ చేస్తూ నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. ఆ పాము ఎలా ఫీల్ అవుతుందో కామెంట్స్ రూపంలో పెడుతున్నారు నెటిజన్స్.. రీల్స్ పిచ్చిది అని తెలీక అనవసరంగా ఈమె కొంపలో దూరాను రా దేవుడా.. అని, అలాగే మధ్యలో పాము ఎందుకు వచ్చింది అక్కా అని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. మరికొంతమంది సాంగ్ లో పాము ఉంది కాబట్టి సరిపోయింది.. ఒకవేళ పులి ఉండి ఉంటే.. అని, అక్క లిరిక్స్ ను బాగా సీరియస్ గా తీసుకుంది అని కామెంట్స్ చేస్తున్నారు. మరికొంతమంది అది డమ్మీ పాము కదా అంటున్నారు. ఏది ఏమైన ఈ వీడియో మాత్రం తెగ

## యూజీసీ నెట్ పరీక్షకు త్వరలో కొత్త తేదీలు : కేంద్ర విద్యాశాఖ




**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 20:** దేశవ్యాప్తంగా నిర్వహించిన జీసీ-నెట్ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్-జాతీయ అర్హత పరీక్ష)లో అక్రమాలు జరిగినట్లు నివేదికలు రావడంతో ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ బుధవారం రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొత్త తేదీలను ప్రకటించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ అధికారులు గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ పరీక్షపై తమకు ఎలాంటి ఫిర్యాదులూ అందలేదన్నారు. అయితే, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సుమోటోగా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఈ అంశంపై సీబీఐ దర్యాప్తు చేపడుతోందని.. బాధ్యులు ఎవరైనా సరే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ గోవింద్ జైశ్వాల్ తెలిపారు.

ఓవైపు నీట్ యూజీ-2024 పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ అయిందని, పలు అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు దేశవ్యాప్తంగా దుమారం రేపుతున్న వేళ మరో సంచలన పరిణామం చోటుచేసుకొన్నది. యూజీసీ-నెట్ పరీక్షను జూన్ 18 మంగళవారం దేశవ్యాప్తంగా 317 నగరాల్లోని 1205 సెంటర్లలో నిర్వహించారు. ఓఎంఆర్(పెన్, పేపర్) విధానంలో నిర్వహించిన ఈ పరీక్షకు 9 లక్షల మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు. అయితే, పరీక్ష సమగ్రత దెబ్బతిన్నట్టు కేంద్ర హెూంశాఖ పరిధిలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్‌కి(ఐ4సీ) చెందిన నేషనల్ సైబర్ క్రైమ్ థ్రెట్ అనలటిక్స్ యూనిట్ నుంచి యూజీసీకి సమాచారం వచ్చింది. దీంతో ఈ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ఎన్టీఏ బుధవారం వెల్లడించింది. పరీక్ష ప్రక్రియ ఉన్నత స్థాయి పారదర్శకత, పవిత్రతను కాపాడేందుకు యూజీసీ నెట్ పరీక్షను రద్దు చేసేందుకు కేంద్ర విద్యా శాఖ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

## పిన్నిని రేప్ చేయబోయిన బాలుడు...ఆమె ఎదురుతిరగడంతో హత్య




**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 20:** నిద్రిస్తున్న పిన్నితో లైంగిక చర్య కోసం బాలుడు ప్రయత్నించాడు. ప్రతిఘటించిన ఆమె అతడ్ని తీవ్రంగా మందలించింది. దీని గురించి కుటుంబ సభ్యులకు చెబుతుందన్న భయంతో ఆ మహిళను బాలుడు హత్య చేశాడు. కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఉప్పినంగడి సమీప గ్రామానికి చెందిన 37 ఏళ్ల మహిళ ఆదివారం రాత్రి ఇంట్లో అనుమానాస్పదంగా మరణించింది. ఆ మహిళ ఇంట్లో ఉన్న పదో తరగతి చదువుతున్న బాలుడు తన తండ్రికి ఫోన్ చేశాడు. గుండెపోటుతో పిన్ని చనిపోయిందని చెప్పాడు. కాగా, మహిళ అనుమానాస్పద మరణం గురించి తెలుసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆదివారం ఆమె ఇంట్లో ఉన్న బాలుడిపై అనుమానం వ్యక్తం చేశారు. తన కుమారుడి వీపుపై చేతితో రక్కిన ఆనవాళ్లు ఉన్నట్లు బాలుడి తండ్రి పోలీసులకు తెలిపాడు. బుధవారం బాలుడ్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. దీంతో ఆమెను తానే చంపినట్లు అతడు ఒప్పుకున్నాడు. ఇంట్లో నిద్రిస్తున్న పిన్నితో లైంగిక చర్య కోసం ప్రయత్నించినట్లు ఆ బాలుడు తెలిపాడు. ప్రతిఘటించిన ఆమె తనను మందలించిందని పోలీసులకు చెప్పాడు. అయితే ఇంట్లో వారికి దీని గురించి చెబుతుందేమోనని భయాందోళన చెందానని అన్నాడు. తిరిగి నిద్రలోకి జారుకున్న పిన్ని ముఖాన్ని దిండితో నొక్కి ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. తనను తోసివేసేందుకు ప్రయత్నించినప్పుడు తన వీపుపై ఆమె రక్కిందని పోలీసులకు వెల్లడించాడు. ఆ బాలుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/



## ప్రభాస్ సెట్‌లో అందరి కాళ్ళకి దండం పెడతాడు.. అమితాబ్ కాళ్లకు దండం పెట్టినప్పుడు..



చూసి ముర్వాలే


ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 20: ప్రభాస్ జూన్ 27న కల్కి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ సినిమాపై భారీ అంచనాలే ఉన్నాయి. హాలీవుడ్ రేంజ్ లో ఉండబోతున్న ఈ సినిమా కోసం అభిమానులతో పాటు ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. తాజాగా ముంబైలో కల్కి సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈవెంట్ కి ప్రభాస్, దీపికా పదుకోన్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, రానా, నిర్మాత అశ్వినీదత్ హాజరయ్యారు.ముంబైలో జరిగిన కల్కి ప్రీ రిలీజ్ ఈవెంట్లో రానా.. ప్రభాస్, అమితాబ్, కమల్, దీపికాలను ఇంటర్వ్యూ చేశారు. ఈ ఇంటర్వ్యూ సరదాగా సాగింది. అయితే ఈ ఇంటర్వ్యూలో అమితాబ్ ప్రభాస్ గురించి మాట్లాడుతూ.. సెట్ లో అందరి కాళ్లకు నమస్కారం చేస్తాడు అని తెలిపారు. అంటే సెట్ లో తన కంటే పెద్ద వాళ్లకు ప్రభాస్ కాళ్లకు నమస్కరిస్తాడు అని తెలిపారు. ప్రభాస్ దీని గురించి మాట్లాడుతూ.. అమితాబ్ సర్ కాళ్ళకి నమస్కారం చేస్తే, నువ్వు ఇలా చేయొద్దు, నువ్వు చేస్తే నేను కూడా నీ కాళ్లకు నమస్కారం పెడతాను అన్నారు. నేను వద్దు సర్ అంటూ ఆపేసాను అని తెలిపాడు. దీంతో అమితాబ్ వ్యాఖ్యలు వైరల్ గా మారాయి. ప్రభాస్ మర్యాద గురించి అందరికి తెలిసిందే. ఇప్పుడు అమితాబ్ వల్ల ప్రభాస్ షూటింగ్ లో కూడా తన కంటే పెద్ద వాళ్ళ కాళ్ళకి నమస్కారం చేస్తాడని తెలిసింది. దీంతో మరోసారి ప్రభాస్ ని అభినందిస్తున్నారు.

## ప్రకృతి మధ్య ప్రేమమ్ బ్యూటీ.. ముద్దమందారంలా మడోన్నా సెబాస్టియన్!

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 20: ప్రేమమ్ సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులకు దగ్గరైన మడోన్నా సెబాస్టియన్... రీసెంట్ గా షేర్ చేసిన ఫొటోస్ ఇవి. రెడ్ శారీలో మెరిసిపోతోంది..



## సెన్సార్ పనులు పూర్తి చేసుకున్న ప్రభాస్ 'కల్కి'.. రన్ టైం ఎంతంటే.?



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 20: అగ్రనటుడు ప్రభాస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కల్కి 2898 ఏడీ సినిమాపై భారీ అంచనాలు ఉన్న విషయం తెలిసిందే. ఈ మూవీ విడుదలకు ఇంకా 7 రోజులు ఉండగా.. రిలీజ్ డేట్? దగ్గర పడేకొద్ది హైప్? పెరుగుతూ పోతోంది. ముఖ్యంగా ట్రైలర్ తర్వాత ఆ అంచనాలు మరింత భారీగా పెరిగాయి. రీసెంట్‌గా ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేయగా యూట్యూబ్‌లో దూసుకుపోతుంది. అయితే తాజాగా ఈ చిత్రం సెన్సార్ పూర్తి చేసుకున్నట్లు తెలుస్తుంది. దీనికి సంబంధించి సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. సెన్సార్ సభ్యులు ఈ సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ ఇచ్చినట్లు సమాచారం. ఇక ఈ సినిమా రన్ టైం విషయానికి వస్తే.. 3 గంటల 56 సెకండ్లు రన్ టైం అని తెలుస్తుంది. మరోవైపు ఈ మూవీపై సెన్సార్ సభ్యులు ప్రశంసల వర్షం కురిపించారు. 3 గంటలు సీట్లో నుంచి కుర్చోనివ్వకుండా చేసింది ఈ చిత్రం. ఇందులో మైండ్ బ్లాక్ అయ్యే ట్విస్టులు ఉన్నట్లు సెన్సార్ సభ్యులు తెలిపారు.

కాగా, ఈ సినిమాలో బిగ్? బీ అమితాబ్ బచ్చన్, యూనివర్సల్? స్టార్? కమల్ హాసన్, దీపికా పదుకొణె, దిశా పటానీ కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన పోస్టర్లు, టీజర్లు ఎంతగా ఆకట్టుకున్నాయో తెలిసిన విషయమే. మహాభారతంతో మొదలై క్రీస్తుశకం 2898లో పూర్తయ్యే కథ ఇది. వైజయంతీ మూవీస్? భారీ బడ్జెట్?తో నిర్మించింది. మహానటి ఫేమ్? నాగ్? అశ్విన్ తెరకెక్కించారు. జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్?గా సినిమా రిలీజ్? కానుంది.



## భర్తకు ముద్దు పెడుతూ..... ఫోజులిచ్చిన కాజల్

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 20: కాజల్ అగర్వాల్ తన లేటెస్ట్ ఫోటోలను ఇన్?స్టాలో షేర్ చేసింది. బర్త్?డే స్పెషల్ ఫోటోలను షేర్ చేసి.. వాటికి ఎమోషనల్ క్యాప్షన్ ఇచ్చింది.



### ఫొటో నచ్చిందో చెప్పమంటున్న..

## 'తీన్‌మార్' బ్యూటీ కృతి కర్బంద!

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 20: పవన్ కళ్యాణ్ 'తీన్ మార్' మూవీలో హీరోయిన్ గా నటించిన కృతి కర్బంద.. బాలీవుడ్ లో బిజీగానే ఉంది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే కృతి రీసెంట్ గా షేర్ చేసిన ఫొటోస్ ఇవి...



## మేకప్ లేకుండా అనసూయ..పేరుకు తగ్గట్లు ఇప్పుడున్నావంటూ నెటిజన్ కామెంట్

ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 20: స్టైలిష్ లుక్?లో అభిమానులను అలరించే అనసూయ.. మేకప్ లేకుండా చాలా సహజంగా కనిపించింది. ఆ ఫోటోలను ఇన్?స్టాలో షేర్ చేసింది భామ.

## సుస్మితను చూసి గర్వపడుతున్నా.. 'పరువు' వెబ్‌సిరీస్‌పై చిరు ఆసక్తికర కామెంట్స్!



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 20: గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ ప్రై.లి. బ్యానర్ మీద విష్ణు ప్రసాద్ లగ్గిశెట్టి, సుస్మిత కొణిదెల నిర్మించిన జీ5 ఒరిజినల్ సిరీస్ 'పరువు'. సిద్దార్థ్ నాయుడు, వడ్లపాటి రాజశేఖర్ ఈ సిరీస్‌కు దర్శకులు. ఈ వెబ్ సిరీస్‌లో నాగబాబు, నివేదా పేతురాజ్, నరేష్ అగస్త్య, ప్రణీత పట్నాయక్, బిందు మాధవి, అమిత్ తివారి వంటి వారు ప్రముఖ పాత్రలు పోషించారు. ఈ జీ5 ఒరిజినల్ సిరీస్ జూన్ 14 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. ఈ వెబ్ సిరీస్ ఎంతో గ్రిప్పింగ్‌గా ఉండటం.. ఉత్కంఠ భరితంగా సాగడంతో వీక్షకులను ఇట్టే ఆకట్టుకుంది. దీంతో రెండో సీజన్ కోసం అందరూ ఎదురుచూస్తున్నారు. ఇక తాజాగా పరువు వెబ్ సిరీస్‌ను చూసిన మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా వేదికగా స్పందించారు. రెండో సీజన్ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నానని తెలిపారు.ఒక చక్కటి ప్లాన్‌తో చందు బాడీ మాయం చేసి, ఆ జంట పడే తిప్పలు.. అదే విషయమై ఎమ్మెల్యే గారి పాట్లు.. చివరకి ఈ జంట తప్పించుకుందా? లేదా? అని సీజన్2లోనే చూడాలనుకుంటా అని తన ఎగ్జైట్మెంట్‌ను పంచుకున్నారు."పరువు చాలా పెద్ద సక్సెస్ అయింది. తెలుగు ఓటీటీలో అద్భుతమైన కంటెంట్‌ను ఇస్తున్న సుష్మిత కొణిదెలను చూస్తుంటే ఎంతో గర్వంగా ఉంది. నా ప్రియమైన సోదరుడు నాగబాబు అద్భుతంగా నటించారు" అని చిరు ట్వీట్ చేశారు.

Published by: Rathnasri Latha on Behale of RRR Media Patel Nagar chowrasta.. Amberpet.. Hyderabad.. Telangana. 500013 cell: 888643 1510, 9949 152838